RNI. No. TELTEL /2022/ 89348



మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు దిన ప త్రి క

సంపుటి : 4 సంచిక : 122 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | శుక్రవారం, మే,1, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం



### రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

డిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి కి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని, ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0 లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సింధూర్ ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ అని, ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి సరైన సమయంలోనే దాన్ని ముగించామని, అది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయమని అన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని చెప్పారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని, మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని, దానికి బహుముఖ కోణాలు ఉన్నాయని అన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాకిస్థాన్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

## ఆమె వేదనను ఏదీ పూడ్చలేదు..

### 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- ఆమె పడిన వేదనను ఏదీ భర్తీ చేయలేదని చీఫ్ జస్టిస్ వ్యాఖ్య
- కోర్టు తీర్పును సవాలు చేసే హక్కు ప్రభుత్వానికి లేదని స్పష్టీకరణ
- బిడ్డకు జన్మనిచ్చి దత్తతకు ఇవ్వాలన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన కోర్టు
- పౌరుల వ్యక్తిగత అభిప్రాయాలను గౌరవించాలని ప్రభుత్వానికి సూచన



డిల్లీ: అత్యాచారానికి గురైన 15 ఏళ్ల బాలిక 31 వారాల గర్భాన్ని తొలగించాలంటూ గతంలో ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని తప్పు బడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గురువారం ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిపై నిప్పులు చెరిగారు. “అత్యాచారం తర్వాత ఆమె (బాధితురాలు) పడిన వేదనను ఏదీ భర్తీ చేయలేదు. మేడమ్, ముందు పౌరులను గౌరవించడం నేర్చుకోండి” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఇచ్చిన తీర్పును బాధితురాలు లేదా ఆమె కుటుంబ సభ్యులు మాత్రమే సవాలు చేయగలరని, ఈ విషయంలో ప్రభుత్వానికి ఆ హక్కు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదని, బిడ్డకు జన్మనిచ్చి దత్తతకు ఇవ్వడమే ఏకైక మార్గమని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఇదే ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి జోక్యం చేసుకుంటూ, “మేము వ్యక్తిగత ఎంపిక లను గౌరవిస్తాము, మీరు కూడా అలాగే గౌరవించాలి” అని ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేస్తూ, బాధితురాలి హక్కులకే అత్యున్నత న్యాయస్థానం పెద్దపీట వేసింది.

## రిటైర్మెంట్ రోజే గుడ్ న్యూస్...

## తెలంగాణ స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్‌గా బి.శివధర్ రెడ్డి నియామకం



హైదరాబాద్,: తెలంగాణ డీజీపీగా పదవీ విరమణ చేసిన బి శివధర్ రెడ్డికి ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ప్రభుత్వ సెక్యూరిటీ అడ్వైజర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు, లా అండ్ ఆర్డర్,ఇంటర్నల్ సెక్యూరిటీ, క్రైమ్ కంట్రోల్, నార్కోటిక్స్ కం ట్రోల్ అండ్ రోడ్ సేఫ్టీ విభాగాలను శివధ్ రెడ్డి పర్యవేక్షించనున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి సేవలను మరింతగా వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. SIBలో శివధర్ రెడ్డి సేవలకు గుర్తింపుగా రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నమెంట్ చీఫ్ సెక్రటరీ హోదా కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి మూడేళ్లపాటు కొనసాగనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. శివధర్ రెడ్డికి నెలకు రూ.2.25 లక్షల వేతనం ఉంటుంది అని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీజీపీగా పదవీ విరమణ చేసిన రోజునే శివధర్ రెడ్డిని భద్రతా సలహాదారుగా నియమించడం విశేషం.

భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి: తెలంగాణ డీజీపీగా పదవీ విరమణ చేసిన బి శివధర్ రెడ్డికి ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ప్రభుత్వ సెక్యూరిటీ అడ్వైజర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు, లా అండ్ ఆర్డర్,ఇంటర్నల్ సెక్యూరిటీ, క్రైమ్ కంట్రోల్, నార్కోటిక్స్ కంట్రోల్ అండ్ రోడ్ సేఫ్టీ విభాగాలను శివధ్ రెడ్డి పర్యవేక్షించనున్నారు. ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నట్లు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులో వెల్లడించారు. చీఫ్ సెక్రటరీ హోదా కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణ భద్రతా సలహాదారుగా నెలకు రూ.2.25 లక్షలు వేతనం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

అలాగే ఆఫీస్ కూడా కేటాయించనుంది. ఉచిత వసతి లేదా హెచ్ఆర్ఏ రూ.50వేల వరకు ఇవ్వనున్నట్లు తెలిపింది. మెడికల్ రీయింబర్స్ మెంట్ సౌకర్యం కూడా కల్పించనున్నట్లు తెలిపింది.అలాగే ప్రభుత్వం వెహికల్ కూడా సమకూర్చనుంది అని తెలిపింది.

## బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా..

## వీహెచ్ నియామకం



- అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర మంత్రి సమాన హోదాలో ఈ పదవిలో వీహెచ్ నియామకం

హైదరాబాద్, : కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు (వీహెచ్)కు తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. బీసీ వర్గాల గళంగా గుర్తింపు పొందిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వి. హనుమంతరావు గారిని రాష్ట్ర మంత్రి హోదాతో ఈ పదవిలో నియమించారు. దీని ప్రకారం ఆయనకు నెలకు రూ. 1,00,000 వేతనం అందనుంది. ఒకవేళ ప్రభుత్వ నివాసం కేటాయించకపోతే రూ. 50,000 ఇంటి అద్దె భత్యం (ఎ=ూ) పొందే అవకాశం ఉంటుంది. ప్రయాణ ఖర్చుల కోసం రూ. 30,000 కన్వేయన్స్ అలవెన్స్, రూ. 15,000 ఇంధన ఖర్చులతో పాటు డ్రైవర్‌తో కూడిన ప్రభుత్వ వాహనాన్ని కూడా ప్రభుత్వం సమకూరుస్తోంది. వైద్య ఖర్చుల విషయంలో కూడా ఆయనకు అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులతో సమానమైన రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించారు. ఆయన కార్యకలాపాల కోసం బీసీ సంక్షేమ శాఖ ఒక ప్రైవేట్ సెక్రటరీ (పీఎస్), డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్లు, డ్రైవర్‌తో కూడిన ప్రత్యేక సిబ్బందిని కేటాయించింది. దశాబ్దాలుగా బీసీ హక్కుల కోసం పోరాడుతున్న హనుమంతరావు అపారమైన అనుభవం... ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు దిశానిర్దేశం చేయడంలో కీలకం కానుంది. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో ఆయన సలహాలు ఇప్పుడు అధికారిక ముద్ర వేయనున్నాయి. సీనియర్ నేతలకు ఇలాంటి కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా అటు పార్టీలోనూ, ఇటు సామాజిక సమీకరణాల్లోనూ సమతుల్యత పాటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.

### మే2న నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, ఏప్రిల్30 :నగరంలోని పలు ప్రాంతాలకు మే 2వ తేదీన 24గంటల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తుతుందని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్‌లో ఉన్న 1.36ఎంఎల్ సామర్థ్యం గల పాత బ్యాలెన్సింగ్ ట్యాంక్ శుభ్రపరిచే పనులను మే 2న ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు చేపట్టనున్నారు. ఈ పనుల నేపథ్యంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో లోప్రెజర్‌తో నీటిసరఫరా, గోషామహల్, కార్వాన్, గోల్కొండ, కవాడిగూడ, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధుల్లో సరఫరాలో అంతరాయాలు తలెత్తనున్నాయని తెలిపారు. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## కేసీఆర్ రీ లోడింగ్..

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో మరోసారి విద్యార్థి శంఖారావం వినిపించాలని గులాబీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. ఉద్యమ కాలంలో కేసీఆర్ పిలుపుతో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలు ఎలాగైతే కదిలాయో.. అదే తరహా ఇంటెన్సిటీని ప్రస్తుత రాజకీయ పోరాటాల్లోకి తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రత్యక్షంగా రంగంలోకి రాకముందే విద్యార్థి లోకం రహదారులపైకి వచ్చింది. విద్యార్థుల పోరాటమే ఆనాడు రాజకీయ పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని కేసీఆర్ మళ్ళీ నమ్ముకున్నారు. ప్రతి కాలేజీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగ కమిటీలను బలోపేతం చేయాలని, యువతను ఫుల్ టైమ్ పొలిటికల్ వారియర్స్ ‘గా మార్చాలని ఆయన ఆదేశించడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ యంత్రాంగం కొంత స్తబ్దుగా మారినా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలంటే విద్యార్థుల తెగువ అవసరమని ఆయన గుర్తించారు. అయితే, ఉద్యమ కాలం నాటి సెంటిమెంట్ వేరు, ఇప్పటి రాజకీయ అవసరాలు వేరు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం అనే ఏకైక లక్ష్యం విద్యార్థులను భావోద్వేగంతో ఏకం చేసింది. కానీ నేడు ఉపాధి కల్పన, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలే విద్యార్థి రాజకీయాలను శాసిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ వంటి వారి నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడి, ఫీజుల బకాయిలపై నిరసనలు చేపడుతూ యాక్టివ్ అవుతున్నారు. కానీ, రాజకీయ ప్రయోజనాల కోసం చేసే పోరాటాలకు విద్యార్థులు ఏ మేరకు స్వచ్ఛందంగా కదులుతారనేది ప్రశ్నార్థకమే. కేసీఆర్ కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, యువతకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు. కాలేజీ స్థాయిలోనే నాయకత్వ లక్షణాలు పెంచి, వారిని



భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రంగా చూపడం ద్వారా కొత్త రక్తాన్ని పార్టీలోకి ఎక్కించాలనుకుంటున్నారు. ప్రభుత్వంపై పోరాడే క్రమంలో విద్యార్థులు ఎదుర్కొనే కేసులను, సమస్యలను పార్టీ అండగా నిలబడి చూసుకుంటుందని భరోసా ఇవ్వడం ద్వారా వారిని యాక్టివ్ మోడ్ లోకి తీసుకురావాలని చూస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విద్యార్థుల్లో ఉన్న చిన్నపాటి అసంతృప్తిని కూడా వదులుకోకూడదని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రత్యేకించి విద్యా రంగానికి కేటాయింపులు, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ఉన్న వ్యతిరేకతను విద్యార్థి కమి టీల ద్వారా క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం కేసీఆర్ మాస్టర్ ప్లాన్. విద్యా ర్థులు రోడ్డెక్కితే అది సృష్టించే ఇంపాక్ట్ మీడియాలోనూ, ప్రజల్లోనూ బలంగా ఉంటుంది. ఇది రాజకీయం గా బీఆర్ఎస్‌కు మళ్లీ పూర్వవై భవం తీసుకువస్తుందని ఆశిస్తున్నారు.విద్యార్థులను రాజకీయాల కోసం రోడ్లపైకి తీసుకురావడం కేసీఆర్ లాంటి చతురత కలిగిన నేతకు పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. కానీ, కేవలం ప్రభుత్వంపై విమర్శలకే పరిమితం కాకుండా, విద్యార్థుల కెరీర్‌కు బీఆర్ఎస్ ఏ రకమైన భరోసా ఇస్తుందనే స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది.

## బెంగాల్ లో మార్పు ఖాయమేనా..?




కోల్ కత్తా, ఏప్రిల్ 30, : వెస్ట్ బెంగాల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. ఎక్కడ కూడా అధికార టిఎంసి నేతల్లో ఉత్సాహం కనిపించలేదు. కనీసం వారిలో గెలుస్తామని ఆశ కూడా కనిపించలేదు. దీనిని బట్టి అక్కడ బిజెపి హవా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో అధికార టీఎంసీ నాయకులు ప్రతిసారి దూకుడు కొనసాగిస్తుంటారు.. ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తుంటారు. అవసరమైతే హింసకు కూడా వెనుకాడరు. ప్రాణాలను కూడా తీస్తారు. ఎందుకంటే అది మమత రాసిన రాజ్యాంగం.. మమత బెనర్జీ గత 15 సంవత్సరాలుగా వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలో రూపొందించిన తన మార్క్ న్యాయం. అవినీతి అక్కడ నిత్య కృత్యం.. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులకు అది సురక్షితమైన షెల్టర్.. మమత బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారికి అద్భుతంగా అండదండలు లభించాయి. చివరికి ఆధార్ కార్డులు.. ఓటరు గుర్తింపు కార్డులు కూడా అందాయి. దీంతో మమత పార్టీ కి దండిగా ఓట్లు పడ్డాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.కేంద్ర ఎన్నికల సంఘం అక్రమంగా నమోదైన ఓటర్లను ఏరి వేసే కార్యక్రమం చేపట్టింది.. దీంతో చాలామంది అక్రమార్కులు తమ ఓటు హక్కును కోల్పోయారు. ఇది ఒక రకంగా మమతకు గట్టి ఎదురు దెబ్బ. అయితే ఈసారి ఎన్నికలను బిజెపి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి సందర్భంలోనూ మమతకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో తిరుగులేని స్ట్రాటజీని పాటించింది. ఫలితంగా మమత ఏమీ చేయలేని స్థితిలో కూరుకుపోయింది.మీరు ఆశీర్వదిస్తే ఇలాంటి సభలకు వస్తాను. లేనిపక్షంలో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటానని ఎన్నికల సభలో మమత వ్యాఖ్యానించిందంటే.. అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వెస్ట్ బెంగాల్ లో బిజెపి నాయకత్వం ఈసారి ఏకతాటి మీద పని చేసింది. విభేదాలను పక్కనపెట్టింది. సీట్ల విషయంలో కూడా అత్యంత జాగ్రత్తలు పాటించింది. అధికార టీఎంసీ నేతల ఆగడాలను ఎక్కడికి అక్కడ అడ్డుకుంది. అందువల్లే బిజెపి ఈసారి అక్కడ అధికారంలోకి వచ్చే అవకాశం కనిపిస్తుంది.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొత్తంగా 294 స్థానాలు ఉన్నాయి. మెజారిటీ సంస్థలు బిజెపి అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో అస్సాం, పుదుచ్చేరి ప్రాంతాలలో ఎన్డీఏ గెలుపు దాదాపుగా ఖాయం. ఇప్పుడు అదనంగా వెస్ట్ బెంగాల్ కూడా బిజెపి ఖాతాలో చేరుతోంది.

# సంపాదకీయం

## మనువాదం, మగవాదం, మార్కెట్ తత్వం




ఈ మధ్యన ఒక సీనియర్ నటుడు మహిళల వస్త్రాల గురించి, శరీరాల గురించి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. తన మాటలపై స్త్రీ స్వాతంత్ర్యవాదులు దాడి చేసినా చేయొచ్చనీ ఆయన ముందే సెటైరు వేశారు. ఆ తర్వాత తను వాడిన రెండు పదాలకు మాత్రం క్షమాపణ చెబుతున్నాననీ, అయితే తన ఉద్దేశం మొత్తం భావం సరైనవేననీ ఇంకా సమర్థించుకున్నారు. అంతేగాక తనపై విమర్శ చేసిన నటీమణి పేరు తీసి మరిన్ని సవాళ్లు విసిరారు. ఆయన ప్రస్తావించిన ఉదాహరణలతో ముడిపడి వున్న మహిళలు ముఖ్యంగా నటీమణులు గట్టిగానే సమాధానమిస్తున్నారు. ఇవన్నీ సంచలనం కోసం కూడా చేస్తుంటారనే వాదనా వుంది. అయితే సరిగ్గా ఈ సమయంలోనే మరికొన్ని పరిణామాలు కూడా దుమారం రేపడం గమనించవచ్చు. ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో 2017లో 13 ఏళ్ల మైనర్ బాలికపై ఘోర అత్యాచారానికి పాల్పడటమే గాక ప్రశ్నించిన ఆమె కుటుంబంపైనా హత్యాకాండకు దిగిన బిజెపి మాజీ ఎంఎల్ఎ కులదీప్ సెంగార్‌పై శిక్షను నిలిపేసి బెయిల్‌పై విడుదల చేశారు. రాజస్థాన్‌లో జాట్ కులస్తులలో ఒక శాఖకు చెందిన వివాహిత మహిళలు మొబైల్ ఫోన్ వినియోగించరాదనీ, చదువుకునే అమ్మాయిలు కూడా చదువులు, పరీక్షలకు మాత్రమే దాన్ని వాడుకోవాలనీ ఒక కులపంచాయితీ హుకుం జారీ చేసింది.

అసభ్యతల పరంపర: ఇవి గత రెండు మూడు రోజుల సంగతులు మాత్రమే. కాస్త వెనక్కు వెళితే కొద్ది రోజుల కిందట బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉద్యోగ నియామకం కోసం వచ్చిన యువతి బురఖా లాగారు. ఈ వయసులో మీరు ఇలాంటి బట్టలు వేసుకోవడం సరైందా అని నటిని ప్రశ్నించిన మరో సీనియర్ పాత్రికేయుడు తర్వాత క్షమాపణలు చెప్పారు. ఓ ప్రముఖ బహు భాషా నాయికకూ రాజకీయ నేతకూ సంబంధించి అసభ్య ఆరోపణ చేసిన ఒక రాష్ట్ర మంత్రిణి బాగా ఆలస్యంగా క్షమాపణ చెప్పి బయటపడ్డారు. ఇంకా కొంచెం వెనక్కు వెళితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమ్మాయి పుట్టాలని ఎవరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వాలంటీర్ల కారణంగా కుటుంబాల్లో మహిళలు అదృశ్యం అవుతున్నారని అప్పట్లో ఆరోపించారు. సినిమా హీరోలు, నటులు వేడుకల్లో ఉపయోగించిన అవాకులు చవాకులు సరేసరి. అమరావతి వేశ్యల రాజధానిగా మారిందని అలాంటి లెక్కలనే ఉటంకిస్తూ ఒక పాత్రికేయుడు కల్లోల కారకులయ్యారు. ఒక మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషుడు బికినీలు వేసుకోవద్దని ప్రకటించారు. శాసనసభల్లోనే పెద్ద నేతల భార్యల గురించి వెకిలిగా మాట్లాడిన మంత్రులున్నారు. ఇప్పటికీ భార్యలను, కుటుంబ సభ్యులనూ అనవసరంగా చర్చలోకి తెచ్చే ధోరణులు సాగుతూనే వున్నాయి. కీలక పదవుల్లో వున్న మహిళలనూ అగ్రతారలనూ కూడా అవమానకరంగా మాట్లాడిన ఉదంతాలున్నాయి. ఈ వ్యాఖ్యలు చేసిన వారి నేపథ్యాలూ, ముగింపులూ అన్నీ ఒకే తరహాకు చెందినవి కావనేది నిజమే. ఇలాంటి వివాదాలు జరిగినపుడల్లా వ్యక్తులు, సంస్థలు వారివారి రాజకీయాలనూ అభిమాన దురభిమానాలను బట్టి స్పందించడం, వ్యాఖ్యానించడం జరిగిపోతుంటుంది. కానీ వీటి వెనక వున్న ఘోరమైన కుసంస్కారం, మహిళా వివక్ష మరుగు పడిపోతుంటాయి. స్త్రీల శరీరాలతో సహా వారి జీవితాల పైన, నైతికతపైన, అసలు వారి పుట్టుకల పైన వారి పిల్లల పుట్టుకల పైనా ఇష్టానుసారం మాట్లాడ్డం, బాధితులైన వారినే నిందితులుగా కారకులుగా చూపించడం వీటిలో ఉమ్మడి లక్షణం.

ప్రభుత్వాధినేతల మౌనం: తాజాగా ఈ నటుడు కూడా తను మాట్లాడిన దాంట్లో కేవలం రెండు పదాలు మాత్రమే పొరబాటనీ మొత్తం భావం మంచిదేననీ ఆయన ఇంకా వాదిస్తున్నారు. నిధి అగర్వాల్ అనే నటి ఒక సినిమా వేడుకకు వెళ్లిన సమయంలో ఒక మూక ఆమె పట్ల అనుచితంగా వ్యవహరించి ఇబ్బంది పెట్టిన కారణంగానే అలా హితబోధ చేశానంటున్నారు (నిధి అగర్వాల్ ఇటీవలనే పవన్ కల్యాణ్ సినిమా 'హరిహర వీరమల్లు'లో నాయికగా నటించారు. ఆమె సినిమాను బాగా ప్రమోట్ చేశారని, ఆమెను చూసి సిగ్గుపడి తనూ ప్రమోషన్‌కు వచ్చానని ఆయన అప్పట్లో చెప్పుకున్నారు. ఇప్పుడు ఆమె పాల్గొన్న వేడుక కూడా గ్లోబల్ స్థాయి కలెక్షన్లు తెచ్చుకున్న ఒక హీరోకు సంబంధించింది.). అయితే 'బాధితులనే నిందితులను చేయడం' అన్న వాక్యంతో ఆమె ఆయనపై స్పందించారు. వస్త్రాలతో నిమిత్తం లేకుండానే అబ్బాయిలతో సహా చిన్నపిల్లలపై అత్యాచారాలు, జంతువులపై హింస ఎందుకు జరుగుతున్నాయని నిలదీశారు. ఇక సవాళ్లకు గురైన నటి అనసూయా భరద్వాజ్‌తో సహా పరిశ్రమలో క్రియాశీలంగా వున్న అనేకమంది దీటైన సమాధానాలు ఇచ్చారు. పైగా ఆయన అరకొర క్షమాపణను అర్జంటుగా ఆమోదించవలసిన అవసరమేమిటని తెలుగు నటీనటుల సంఘమైన 'మా'ను ప్రశ్నించారు. గతంలో నిధిని మెచ్చుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్న కూడా వచ్చింది. మహిళా సంఘాలు శివాజీ మాటలను ఖండించడం తప్ప పాలక కూటమి నుంచి ఎవరూ దీనిపై ఎందుకు మాట్లాడటం లేదు? అలాగే ఇప్పుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నాయకులు తమవారి అసభ్య వ్యాఖ్యల తరుణంలో ఎందుకు మాట్లాడలేదు? మహిళలపై కరుడుగట్టిన ద్వంద్వనీతి, మగవాదం, మనువాదం తప్ప ఇందుకు మరో కారణం లేదు. ఇలాంటి విషయాలపై చర్చ అనవసరమనే వాదన కూడా చాలా తప్పు, అనేక ఖండనలు, నిరసనల తర్వాతనే పరిస్థితి ఇలా వుంది. ఇవీ లేకపోతే మనువాదులు మరెంత దారుణంగా వ్యవహరించేవారో ఊహించడం అసాధ్యం. దొందూ దొందే: మనువాదం, మార్కెట్ వాదం, మగవాదం మహిళలను ఒకేలా చూస్తాయి. కానీ ఒకదాన్ని ఒకదానికి పోటీ నిలిపి మాట్లాడుతూ గందరగోళ పరుస్తుంటాయి. మరీ ఇలా, మరీ అలా అనే మాటలు ప్రయోగిస్తుంటాయి. ఉదాహరణకు వస్త్ర ధారణనే తీసుకుంటే నీతులన్నీ మహిళలకే ఎందుకు చెప్పడం? దేశ ప్రధాన మంత్రి నగసాధువుకు సాష్టాంగపడినప్పుడు, మహిళలను కూడా సమాజం మోకరిల్లజేసినపడు వీరికి సభ్యత గుర్తుకు రాదే? కుంభమేళాలో నగసాధువులు ప్రదర్శనలే చేసినప్పుడు నోరెత్తరే? ఇవన్నీ మాట్లాడేవారే సినిమాలు తీసినప్పుడు వారిని ఎలా చూపిస్తుంటారు? కనుక రెండు చోట్లా బలవుతున్నది మహిళలే. సామాజిక సమస్యగా చూడవలసిన ఈ అంశాన్ని కేవలం రాజకీయ కళ్లద్దాలతో చూడటం కూడా తప్పే. ఈ మధ్య కేరళలో ఎంఎల్ఎ ఒకరు తప్పుగా మాట్లాడితే ఆ ప్రభుత్వం వెంటనే కేసు పెట్టింది తప్ప వదిలేయలేదని గమనించాలి. నాలుగు రకాలుగా మహిళల విషయంలో తప్పుడు మాటలు వస్తుంటాయి. మొదటిది-వారి వస్త్రాల వల్లనే లేక వారు బయటికి రావడం వల్లనే తప్పుగా ప్రవర్తిస్తున్నారని చెప్పడం. ప్రొవోక్ చేసే అంటే రెచ్చగొట్టే బట్టలు వేసుకోవద్దనే మాట ఇందులో సర్వసాధారణం. ఒకరి వస్త్రధారణను బట్టి మరొకరు రెచ్చిపోవడం

## ట్రేడింగ్‌లో మెళకువలంటూ..
# 1.36 కోట్లు కొట్టేశారు



హైదరాబాద్: ట్రేడింగ్‌లో మెళకువలు చెబుతామంటూ సైబర్ నేరాల ముఠా ఓ ఐటీ ఉద్యోగిని నుంచి 1.36 కోట్లు దోచుకున్నారు. నగరంలో కమలానగర్‌కు చెందిన ఓ ఐటీ ఉద్యోగిని సెప్టెంబర్ నెలలో ఫేస్‌బుక్‌లో ఒక లింక్‌ను క్లిక్ చేసింది. బీఓబీక్యాప్స్ ఇన్ఫర్మేషన్ లర్నింగ్ గ్రూప్స్(ఎఫ్516) పేరుతో ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్‌కు నెంబర్ యాడ్ అయ్యింది. అందులో ఇద్దరు సైబర్ దొంగలు మారు పేర్లతో వేర్వేరుగా మాట్లాడారు. స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ఎలా? ఏ స్టాక్స్ ఎలాంటి లాభాలొస్తాయనే విషయంలో మెళకువలు చెబుతామంటూ యూజర్ ఐడీ ఇచ్చారు. దీంతో బీవోబీక్యాప్స్ క్యూల్‌బి- ఇన్.కామ్ పేరుతో ఉన్న లింక్‌ను పంపించి అందులో ఖాతాను క్రియేట్ చేసుకొని రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టింది. దీంతో కొన్ని లాభాలు వచ్చాయి, అందులో నుంచి వెయ్యి రూపాయలు విత్ డ్రా చేసుకుంది. దీంతో సదరు ఐటీ ఉద్యోగినికి ఇదంతా నమ్మకమైన వ్యవహారమే అనిపించింది. వారం రోజుల తరువాత 'మీకు ట్రూ అల్టా బయో ఎనర్జీ ఐపీఓ ఓపెన్ అయ్యింది, మీరు వెంటనే ఇన్వెస్ట్ చేయండి, అందులో మేం కూడా కొంత ఫండింగ్ చేస్తాం' అంటూ నమ్మించారు. దీంతో రూ. 53.96 లక్షలు, రూ.68 లక్షలు మరోసారి ఇలా రెండు సార్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో స్క్రీన్‌పై రూ. 2 కోట్ల లాభం కన్పించింది. అందులో నుంచి కొంత డబ్బు విత్ డ్రా చేసుకోవడానికి ఆమె ప్రయత్నించింది. తమకు రూ.31 లక్షల కమిషన్ చెల్లించిన తరువాత డబ్బు విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తామని సైబర్‌నేరగాళ్లు సూచించారు. అకౌంట్లో ఉన్న డబ్బులో మినహాయించుకొని తమకు రావాల్సింది ఇవ్వాలంటూ బాధితురాలు కోరగా అందుకు వారు నిరాకరించారు. కాగా అదే సమయంలో జనరల్ అట్లాంటిక్(బీఎఫ్04) అనే స్టాక్ ట్రేడింగ్ గ్రూప్‌లోను బాధితురాలు ఇన్వెస్ట్ చేసింది. రూ. 2 లక్షలు డిపాజిట్ చేయడంతో కొంత లాభం రావడంతో వెంటనే రూ. 34 లక్షలు పెట్టుబడి పెట్టింది. అందులో కొంత డబ్బు విత్ డ్రా చేసుకోగా మరికొంత డబ్బు అందులోనే ఉంది. కాగా రుబికాన్ రిసర్చ్ లిమిటెడ్ ఐపీఓ షేర్స్ ఉన్నాయని వాటిలో పెట్టుబడి పెట్టాలంటూ మరికొంత ఇన్వెస్ట్ చేయిం చారు. ఇక్కడ కూడా తన డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్ని చడంతో సైబర్‌నేరగాళు నిరాకరించారు. ఇలా రెండు ఫ్లాట్ ఫామ్స్‌పై రూ. 1.55 కోట్లు పెట్టుబడి పెట్టడంతో రూ. 19 లక్షలు బాధితురాలు తిరిగి రాబట్టుకోగా రూ. 1.36 కోట్లు సైబర్‌నేరగాళ్లు కాజేశారు. దీనిపై బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# క్లౌడ్ స్టోరేజ్ సేఫ్టీ ఎంత

హైదరాబాద్, : నేటి డిజిటల్ యుగంలో, ప్రతి ఒక్కరికీ ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, యాప్ డేటా పుష్కలంగా ఉంటాయి. అయితే, ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లలో పరిమిత స్టోరేజ్ కారణంగా.. ప్రతిదీ ఒకే చోట నిల్వ చేయడం అసాధ్యం. క్లౌడ్ స్టోరేజ్ ఆధునిక, సురక్షితమైన పరిష్కారంగా ఉద్భవించింది. క్లౌడ్ స్టోరేజ్ అంటే మీ డిజిటల్ ఫైల్‌లను ఇంటర్నెట్ ద్వారా రిమోట్ సర్వర్‌లో నిల్వ చేయడం. దీని అర్థం మీ ఫోటోలు, వీడియోలు మీ ఫోన్ లేదా కంప్యూటర్‌లో కాకుండా కంపెనీ డేటా సెంటర్‌లో నిల్వ చేయడం. ఈ డేటా సెంటర్ వేలకొద్దీ శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్‌లతో రూపొందించడం జరిగింది. ఇవి మీ డేటాను సురక్షితంగా ఉంచుతూ 24 గంటలూ పనిచేస్తాయి. మీరు గూగల్ డ్రైవ్, ఐక్లౌడ్, డ్రాప్ బాక్స్ వంటి క్లౌడ్ సేవను ఉపయోగించినప్పుడు, మీ ఫైల్ ఇంటర్నెట్ ద్వారా ఆ కంపెనీ సర్వర్‌లకు వెళుతుందు. అక్కడ, ఫైల్ చిన్న డేటా బ్లాక్‌లుగా విభజించబడి బహుళ సర్వర్‌లలో నిల్వ చేయడం జరుగుతుంది. ఒక సర్వర్ సాంకేతిక వైఫల్యాన్ని ఎదుర్కొంటే, మీ డేటాను మరొక సర్వర్ నుండి సులభంగా తిరిగి పొందగలిగేలా ఇది పని చేస్తుంది. దీనిని డేటా రిడెండెన్సీ అంటారు. తరువాత, మీరు అదే ఫైల్‌ను మళ్ళీ తెరిచినప్పుడు, సిస్టమ్ ఈ డేటా బ్లాక్‌లన్నింటినీ కలిపి మీకు పూర్తి ఫైల్‌ను చూపుతుంది. ఈ మొత్తం ప్రక్రియకు కొన్ని సెకన్లు పడుతుంది. మీ ఫైల్ అక్కడే ఉన్నట్లు, క్లౌడ్‌లో సురక్షితంగా ఉన్నట్లు మీకు అనిపిస్తుంది. క్లౌడ్ కంపెనీలు తమ సర్వర్లలో నిల్వ చేసిన డేటాను ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని ఉపయోగించి రక్షిస్తాయి. దీని అర్థం మీ ఫైల్‌లు కోడెడ్ రూపంలో నిల్వ చేయడం జరుగుతుంది. వీటిని తెలియని వారు చదవలేరు. యాక్సెస్ చేయలేరు. లాగిన్ ఆధారాలు, యాక్సెస్ అనుమతులు ఉన్న వినియోగదారులు మాత్రమే ఫైల్‌లను తెరవగలరు. అదనంగా, కంపెనీలు బహుళ-పొర భద్రత, ఫైర్‌వాల్‌లు, సాధారణ బ్యాకప్ వ్యవస్థలను ఉపయోగించి డేటా హ్యాకింగ్ లేదా నష్టం నుండి రక్షించినట్లు నిర్ధారించుకుంటాయి. వేగవంతమైన, నమ్మదగిన సేవలను అందించడానికి క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో తమ డేటా సెంటర్లను నిర్మించారు. ఉదాహరణకు, గూగుల్ అమెరికా, సింగపూర్, ఐర్లాండ్, భారతదేశం వంటి దేశాలలో డేటా సెంటర్లను కలిగి ఉంది. అదేవిధంగా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ కూడా వారి స్వంత విస్తారమైన సర్వర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్నాయి. ఇవి 24 గంటలూ డేటాను నిల్వ చేసి నిర్వహిస్తాయి. క్లౌడ్ స్టోరేజ్ అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే మీరు మీ పరికరంలో డేటా స్టోరేజ్ ఖాళీ చేయవలసిన అవసరం లేదు. మీరు మీ ఫైల్‌లను ఎక్కడి నుండైనా యాక్సెస్ చేయవచ్చు. మీరు మీ ఫోన్‌ను పోగొట్టుకున్నా లేదా మీ ల్యాప్‌టాప్ క్రాష్ అయినా, మీ డేటా ఇంటర్నెట్‌లో సురక్షితంగా ఉంటుంది.

# 72 ఏళ్ల వయసులో పతకాలు

ఉద్యోగ విరమణ తరువాత చాలామంది ప్రశాంతమైన జీవితం గడుపుతారు. కొందరు మాత్రమే ప్రత్యేకంగా జీవిస్తారు. తమ కలలని, అభిరుచులని విరామ సమయంలో మరింతగా సాధన చేస్తారు. అలాంటి వారిలో ఒకరే కర్నాటకకి చెందిన బి.మంజమ్మ. విశ్రాంత ఉద్యోగి అయిన మంజమ్మ 72 ఏళ్ల వయసులో అథ్లెట్‌గా రాణిస్తూ పతకాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన 23వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. మంజమ్మ క్రీడా ప్రయాణం 7 ఏళ్ల క్రితం ప్రారంభమైంది. ఈ తక్కువ సమయంలోనే ఆమె 110 పతకాలు సాధించారు. జిల్లా ఆరోగ్య అధికారి కేంద్రంలో 'లేడీ హెల్త్ విజిటర్ (ఎల్‌హెచ్‌వి)'గా, ఇన్‌చార్జ్ నర్సింగ్ ఆఫీసర్‌గా 2013లో 36 ఏళ్ల ఉద్యోగ జీవితం నుండి ఆమె రిటైర్డ్ అయ్యారు. ఆ సంవత్సరమే భర్త మరణించడంతో మంజమ్మని తీవ్ర నిరాశనిస్పృహలు చుట్టుముట్టాయి. ఆ బాధ నుండి తనని తాను విముక్తి చేసుకోవాలనుకుని జాగింగ్ చేయడం ప్రారంభించారు. అలా తన 65 ఏళ్ల వయసులో మంజమ్మ 2018 నుండి కొత్త జీవితాన్ని ప్రారంభించారు. అప్పటి నుండి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు.



'క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి' అని చెబుతున్న మంజమ్మ తన ప్రయాణం గురించి మరిన్ని వివరాలు ఇలా చెప్పారు. 'బెంగళూరులో డాక్టరుగా ఉన్న నా కూతురు వర్షిని, నా క్రీడా ప్రయాణాన్ని ఎంతో ప్రోత్సహిస్తోంది.

## ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హిమాయత్ నగర్ : చేవెళ్ల డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఏకలవ్య ఎరుకల సంఘం కోరింది. ఈ మేరకు మంగళ వారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో హైదరాబాద్‌మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకే ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరుకలను విస్మరించిందన్నారు. గత ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు ఎదురుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత 12 ఏళ్లుగా ట్రైకార్ చైర్మన్ పదవీని లంబాడీల సామాజిక వర్గానికి పరిమితం చేశారని, ఈసారి ఎరుకల సామాజిక వర్గానికి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో చదువుకుంటున్న ఎరుకల విద్యార్థులు నివసించడానికి ఒక హాస్టల్ నిర్మించాలని, విదేశాలలో చదువుకోవడానికి ఇచ్చే అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద ఎరుకల యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## దేశంలో లక్షకు మించి పెట్రోల్ పంపులు



దేశీయంగా పెట్రోల్, డీజిల్ వినియోగానికి తగినట్లుగా, వాటి విక్రయ కేంద్రాల సంఖ్య అధికమవుతోంది. గత దశాబ్దకాలంలోనే దేశంలోని పెట్రోల్ పంపుల సంఖ్య రెట్టింపైందని చమురు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది నవంబరు చివరికి 1,00,266 పెట్రోల్ పంపులున్నాయని.. 2015లో ఈ సంఖ్య 50,451 మాత్రమేనని వెల్లడించింది. వాహన కొనుగోళ్లు భారీగా పెరిగినందున, గ్రామీణ ప్రాంతాలతో పాటు జాతీయ రహదారుల వెంబడీ పెట్రోల్ పంపుల విస్తరణ అధికమవుతోంది. అమెరికా, చైనా తరవాత మనదేశమే అధికంగా పెట్రోల్ పంపులను కలిగిన దేశాల్లో అమెరికా (1,96,643), చైనా (1,15,228) తర్వాత మనదేశమే ఉంది. దేశీయంగా ప్రభుత్వరంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆధ్వర్యంలోనే 90% పైగా పెట్రోల్ పంపులున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థల్లో రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ అనుబంధ సంస్థ నయారా ఎనర్జీ లిమిటెడ్ 6,921, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ – బీపీ సంయుక్తంగా 2,114, షెల్ 346 పెట్రోల్ పంపులను నిర్వహిస్తున్నాయి. 2003–04లో 27 పెట్రోల్ పంపులతో మనదేశంలో ప్రైవేట్ సంస్థల కార్యకలాపాలు ఆరంభమయ్యాయి.

2015లో మొత్తం 50,451 పెట్రోల్ పంపుల్లో ప్రైవేటువి 2,967 (5.9%), కాగా.. ప్రస్తుతం వాటి వాటా 9.3 శాతానికి పెరిగింది. మన దేశంలో అత్యధికంగా 41,664 పెట్రోల్ పంపులను ఐఓసీ, 24,605 కేంద్రాలను బీపీసీఎల్, 24,418 పంపులను హెచ్‌పీసీఎల్ నిర్వహిస్తున్నాయి. మొత్తం పంపుల్లో గ్రామీణ ప్రాంతాల వాటా దశాబ్దం క్రితం 22% కాగా.. ఇప్పుడు 29 శాతానికి పెరిగింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్‌తో పాటు సీఎన్‌జీ, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలను కూడా ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు.

## ఐఫోన్ ఎస్‌ఈ సహా పలు మోడళ్లకు యాపిల్ గుడ్‌బై...



టెక్ దిగ్గజం యాపిల్ ఈ ఏడాది అనేక రకాల స్మార్ట్‌ఫోన్ మోడళ్లతో పాటు ఐప్యాడ్, మ్యాక్, వాచ్, ఇతర డివైజ్‌లను గుడ్‌బై చెప్తోంది. థర్డ్ పార్టీ రిటైల్ స్టోర్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లైన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి చోట్ల ఆయా ఫోన్లు అందుబాటులో ఉంటాయి. కానీ, స్టాక్ పూర్తయిన తర్వాత అవి కూడా మార్కెట్ల నుంచి పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉంటుంది. యాపిల్ సంస్థ అమ్మకాల ఉంచి తొలగించిన స్మార్ట్‌ఫోన్‌లలో ఐఫోన్ ఎస్‌ఈ, 14, 14 ప్లస్, 15, 15 ప్లస్, 16 ప్రో, 16 ప్రో మ్యాక్స్ ఉన్నాయి. అలాగే, ఐఫోన్ ఎస్‌ఈ మోడల్ ఆగిపోవడం మూలంగా టచ్ ఐడీ, హోమ్ బటన్, స్మాల్ స్క్రీన్, ఎల్‌సీడీ డిస్‌ప్లే ఉన్న ఏ ఫోన్‌ను విక్రయించదు. ఐప్యాడ్‌లకు సంబంధించి ఐప్యాడ్ ప్రో(ఎం4 చిప్), ఐప్యాడ్ ఎయిర్ (ఎం2), ఐప్యాడ్(10 జనరేషన్), యాపిల్ వాచ్ అల్ట్రా 2, యాపిల్ వాచ్ సిరీస్ 10, యాపిల్ వాచ్ ఎస్‌ఈ (సెకెండ్ జనరేషన్) సహా మ్యాక్‌బుక్‌లో పలు డివైజ్‌లను కూడా అమ్మకాల నుంచి తొలగించింది. ఇతర పరికరాల్లో ఎయిర్‌పాడ్స్ ప్రో(సెకెండ్ జనరేషన్), విజన్ ప్రో(ఎం2 వెర్షన్) వంటి వాటి విక్రయాలను నిలిపేసింది. యాపిల్ సంస్థ అమ్మకాల ఉంచి తొలగించిన స్మార్ట్‌ఫోన్‌లలో ఐఫోన్ ఎస్‌ఈ, 14, 14 ప్లస్, 15, 15 ప్లస్, 16 ప్రో, 16 ప్రో మ్యాక్స్ ఉన్నాయి. అలాగే, ఐఫోన్ ఎస్‌ఈ మోడల్ ఆగిపోవడం మూలంగా టచ్ ఐడీ, హోమ్ బటన్, స్మాల్ స్క్రీన్, ఎల్‌సీడీ డిస్‌ప్లే ఉన్న ఏ ఫోన్‌ను విక్రయించదు. అలాగే, ఐఫోన్ ఎస్‌ఈ మోడల్ ఆగిపోవడం మూలంగా టచ్ ఐడీ, హోమ్ బటన్, స్మాల్ స్క్రీన్, ఎల్‌సీడీ డిస్‌ప్లే ఉన్న ఏ ఫోన్‌ను విక్రయించదు.




# రామగుండం శాసనసభ సభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు 38వ డివిజన్ కార్పొరేటర్ నెలికంటి రాము ఆధ్వర్యంలో





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం శాసనసభ సభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు 38వ డివిజన్ కార్పొరేటర్ నెలికంటి రాము ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు తిరుమల స్వప్న అధ్యక్షతన జరిగిన అంగన్వాడీ ఫార్మేషన్ డే మరియు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఆరు నెలల పిల్లలకి అన్నప్రాసన, గర్భిణీ స్త్రీల శ్రీమంతం మరియు అంగన్వాడీ పిల్లల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 38వ డివిజన్ కార్పొరేటర్ నెలికంటి రాము మరియు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల ఆంజనేయులు కోటరాజు అంగన్వాడీల సూపర్వైజర్ సరస్వతి మరియు లిటిల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా నెలికంటి రాము మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలలో పోషకాహార లోపం నివారించడానికి పౌష్టికరమైనటువంటి ఆహారం అందించడం మరియు పౌష్టిక విలువల ఆహార అవగాహన గురించి, అదేవిధంగా పిల్లలు ఆరు సంవత్సరాల లోపు పిల్లలలో శారీరక మానసిక పరిపక్వత ఎక్కువగా ఉంటుందని, వారిలో సృజనాత్మక తెలివితేటలు ఈ సమయంలో పెంపొందించాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని పాశ్చాత్య ఆహార పోకడలకు పిల్లలను అలవాటుపరచద్దని తెలిపారు. 38వ డివిజన్లో అంగన్వాడీలు చేస్తున్న కృషిని అభినందిస్తూ మరింత అవగాహన డివిజన్ ప్రజలలో మెరుగుపరచాల్సిందిగా సూచించారు. అంగన్వాడి సూపర్వైజర్ సరస్వతి మరియు లిటిల్ గార్లు అంగన్వాడీల ప్రాముఖ్యత వారి విధులు ప్రజలకు వారు చేయాల్సినటువంటి సూచనలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆర్పీలు, ప్రమోటర్లు, మరియు డివిజన్ ప్రజలు తల్లులు అనేకమంది పాల్గొన్నారు.

# ఆర్జీ. 1 వివిధ విభాగాల విభాగాల అధికారులతో ఆర్జీ.1 జియం లలిత్ కుమార్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రామగుండం ఏరియా 1 జియం కార్యలయం నందు గుర్తింపు సంఘం ప్రతినిధులతో మరియు ఆర్జీ. 1 వివిధ విభాగాల విభాగాల అధికారులతో ఆర్జీ.1 జియం లలిత్ కుమార్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగినది. దీనికి జియం సానుకూలంగా స్పందించడము జరిగినది. ఈ సందర్భంగా జియం గారు తెలియజేస్తూ గత నెలలో జరిగిన నిర్మాణాత్మక సామావేశంలో తీసుకున్న నిర్ణయాలు కొన్ని పరిష్కారం జరిగినవని మరికొన్ని జరగవలసి ఉన్నదని అన్నింటికి సానుకూల వాతావరణంలో పరిష్కారం జరుగుతావని తెలిపారు.

ఏప్రిల్ నెల 2026 స్టక్చర్ కమిటీ డిమాండ్లు

1సింగరేణి ఆర్.జి-1 ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్మెంట్ పై మరియు కార్మిక వాడల్లో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కార్మికులు వారి కుటుంబాలు వాటి వల్ల భయభ్రాంతులకు గురి అవుతున్నారు. కనుక వెంటనే వాటి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలి.

2సింగరేణి క్వార్టర్ లలో ఫ్యాన్లు సరిగా పని చేయకపోవడం వల్ల వారు వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఉక్క పోత తో ఇబ్బందులు పడుతున్నారు కనుక ఫ్యాన్లు కొత్తవి ఏర్పాటు చేయాలి. అదేవిధంగా కార్మిక వాడల్లో వీధిలైట్లు వెలగడం లేదు, తగిన చర్యలు తీసుకోవాలి.

3. సివిల్ డిపార్ట్మెంట్ పరిదిలో ఉన్న డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద రాత్రి షిస్టుల్లో పని చేసేవారు లైటింగ్ సౌకర్యం లేక చీకట్లో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతు న్నారు, అదేవిధంగా ఉదయం షిఫ్ట్ లో పని చేసే వారికి ఫ్యాన్ లు లేక ఉక్కు పోతతో ఇబ్బందులు పడుతున్నారు, కనుక ఫ్యాన్లు మరియు లైటింగ్ సౌకర్యం కల్పించాలి. అదేవిధంగా వేసవి దృష్ట్యా వాల్వ్ ఆపరేటర్లకు మజ్జిగ ప్యాకెట్లు లేదా ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందించాలి.

4జిడికె 183 ఇంక్లైన్ లో ఉన్న కార్మికుల రెస్ట్ షెల్టర్ లలో కబోర్డ్స్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనుక కబోర్డ్స్ ఏర్పాటు చేయాలి.

5 ఓసిపి 5 లో జరిగిన మైన్స్ కమిటీ లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలి. అదేవిధంగా స్టేజి ముందు ఓపెన్ షెడ్ నిర్మాణం చేపట్టాలి, ఆర్వో వాటర్ ప్లాంట్ ఇన్ స్టాల్ చేయాలి. అదేవిధంగా లోడర్ మరియు గ్రేడర్ మిషనరీ కి స్పేర్ షార్ట్స్ లేక గత కొన్ని నెలలుగా ఐడిల్ గా ఉన్నాయి, వెంటనే స్పేర్ పార్ట్స్ తెప్పించి వాటిని వినియోగం లోకి తేవాలి. అదే విధంగా వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని వేళలను మార్చాలి.

6-ఏరియా వర్క్ షాప్ లో లేథ్ మిషన్లు లో టెండర్ ద్వారా కొనుగోలు చేశారు, చీఎ - 26 ఎమీ మిషన్, కంపెనీ పేరు కిర్లోస్కర్ దాని మోటార్ విపరీతమైన శబ్దాలు రావడం వల్ల కార్మికులు ఏకాగ్రత తో పని చేయడం లేదు, దాన్ని రిపేర్ చేయించాలి. అదేవిధంగా షేపింగ్ మిషన్ మొత్తం వైబ్రేట్ అవుతుంది, దీని పై సరిగా పని చేయలేక పోతున్నారు. రిపేర్ చేయించగలరు. అదేవిధంగా ఏరియా వర్క్ షాప్ లో చెట్లు బాగా పెరిగాయి. కొమ్మలను తొలగించి, రేకుల షెడ్ పై రాలిన ఆకులు దోనిల్లో పడి జామ్ కావడం వల్ల వర్షం నీరు బయటకు వెళ్ళడం లేదు దీని వల్ల వర్క్ షాప్ షెడ్ లో వర్షం నీరు పడడం వల్ల కార్మికులు విధులు నిర్వహించలేక పోతున్నారు. దోనుల్లో పడిన చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా గత ఏరియా లెవల్ స్ట్రక్చర్ సమావేశాల్లో ఏరియా వర్క్ షాప్ లో అంతర్గత రోడ్లు వేయాలని కోరగా వేయడం కోసం యాజమాన్యం అంగీకరించి ఇంత వరకు రోడ్లు వేయలేదు, వెంటనే రోడ్లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

7.ఏరియా హాస్పిటల్ లో సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలి.

8. మైన్ లేదా రోడ్డు ప్రమాదం వల్ల చేతులు, కాళ్ళకు ఫ్రాక్చర్ అయిన జనరల్ అసిస్టెంట్ (ఖ+) లకు మరియు టైం రేటెడ్ ఉద్యోగులకు మెడికల్ గ్రౌండ్ ద్వారా అర్హులైన వారికి సర్ఫేస్ లో పోస్ట లకు ప్రత్యేక నోటిఫికేషన్ వేయాలి. 9. ఓసిపి చెక్ పోస్ట్ నుంచి జిడికె 11 ఇంక్లైన్ వరకు ఉన్న మట్టి రోడ్డు ను సిసి రోడ్డుగా మార్చాలి. 10. ఆర్.జి-1 ఏరియా లోని కంపెనీ క్వార్టర్ లలో వేసవి దృష్టా, సరఫరా చేసే తాగు నీటి సమయాన్ని పెంచాలి. అదేవిధంగా కార్మిక వాడల్లో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ లు పని చేయడం లేదు. దీని వల్ల కార్మిక కుటుంబాలు తాగు నీటి కోసం అనేక అవస్తలు పడుతున్నారు. కనుక వెంటనే వాటర్ ప్లాంట్ లు పని చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి గుర్తింపు సంఘం మడ్డి ఎల్ల గౌడ్,డిప్యూటీ జనరల్ సెక్రటరీ, రంగు శ్రీను, డిప్యూటీ బ్రాంచ్ సెక్రటరీ, ఎ. ఆంజనేయులు - ఏ.జి.ఎం. ఐయిడి, డాక్టర్ బి. అంబిక ఏ.సి.ఎం.ఓ, ఎల్. రమేష్, ఏజెంట్, డి. రమేష్ పి.ఓ., కె.డి.ఎన్. వరప్రసాద్ డి.జి.ఎం. సివిల్, ఎం. రవీందర్ రెడ్డి పర్సనల్ మేనేజర్, అధికారులు నారాయణ మూర్తి, ఫిరోజ్ ఖాన్ వీర రెడ్డి మరియు యునియన్ ప్రతినిదులు ఎం. మహేష్, ఎస్. వెంకట్ రెడ్డి, ఎస్. రాజు, పి. విజయ లక్ష్మి, మల్లికార్జున్ జి. ప్రసాద్, పాల్గొన్నారు.

# ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) గోదావరిఖని 5 ఇంక్లైన్ లో నివాసం ఉంటూ ఆటో నడుపుకొని కుటుంబాని పోషించుకుంటున్న ఆటో డ్రైవర్ కుమార్తె పెళ్లి గురువారం నిశ్చయం కాగా బుధవారం రాత్రి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ (మెడికల్ అసోసియేషన్ ) సహకారంతో పెళ్లి కూతురు కుటుంబ సభ్యులకు మెడికల్ అసోసియేషన్ సభ్యుల చేతుల మీదుగా కూలర్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ డాక్టర్ కె. రాజేందర్ హాజరై మాట్లాడారు. గోదావరిఖని మెడికల్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ ఆడపిల్ల పెళ్లికి సహాయం కోరగానే తమ వంతు సహాయంగా కూలర్ అందించడం జరిగిందని తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ముందు ముందు తమ సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వి.ఎస్.ఎస్.ఎస్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ మాట్లాడారు. ఆడబిడ్డ పెళ్లికి సహాయం కోరగానే స్పందించి గోదావరిఖని మెడికల్ అసోసియేషన్ సభ్యులు సహకారంతో ఆర్థిక సహాయం అందించినందుకు వారందరికీ తమ సంస్థ ద్వారా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని సురభి శ్రీధర్ తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహాయ సహకార అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ సభ్యులు పి. సతీష్ , పి. శ్రీనివాస్,ఎన్. కరుణాకర్ రెడ్డి, డి. విష్ణుమూర్తి, బి .రాజేందర్, ఇ. సురేందర్, కె. వెంకన్న, జె .చారి, ఎ. రాజశేఖర్,బి. జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 37 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు..

# సంక్షేమ పథకాలు కట్..?

హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అనర్హులను గుర్తించి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.ముఖ్యంగా పేదలకు ఉద్దేశించిన పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా మారిన విషయం ఉన్నతాధికారుల పరిశీలనలో బయటపడింది. అర్హత లేని వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.ఇదే క్రమంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని రేవంత్ సర్కార్ వర్గాల్లో చర్చ జరుగుతోం ది. పేదలకు అందించే పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభు త్వం నిర్ణయించింది..ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్న కొంతమంది ఉద్యోగులు నిరుపే దలకు అందాల్సిన పింఛన్లు, ఇండ్లు, చివరకు ఉపాధి హామీ కూలీ డబ్బులను కూడా పొందుతున్నట్టు అధికారిక లెక్కల్లో తేలింది. దీనికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నివేదిక ప్రకారం.. దాదాపు 37 వేల మందికి పైగా ఉద్యోగులు వివిధ పథకాల్లో లబ్ది పొందుతున్నట్టు బయటపడింది. వీరిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఈ జాబితాలో చిరుద్యోగులే కాదు.. ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చా యనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వం పేదలకోసం అందిస్తున్న పథకాల్లో ఏప పథకంలో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.. వారిలో ఎంతమంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఎంత మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారనే వివరాలను ఉన్నతాధికా రులు ఇప్పటికే సేకరించారు. ఆ డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తక్షణమే నిలిపివేయాలని నివేదికలో స్పష్టంగా పేర్కొ న్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు.పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు(47), ఎస్జీటీ అండ్ టీజీటీలు (71), పబ్లిక్ హెల్త్ మేనేజర్లు, లెక్చరర్లు, చివరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు(5), జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు కూడా జాబితాలో ఉండడం గమనార్హం. వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉద్యోగులందరి ఆధార్ డేటా తీసుకున్న ప్రభుత్వం.. వాటిని ప్రభుత్వ పథకాలతో సరిపోల్చింది. దీంతో ఈ లెక్కలు బయటపడ్డాయి. ఇంకొన్ని స్కీములలో కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని సెక్రటేరియెట్? వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకంలోనే అత్యధికంగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు. అధికా రుల నివేదిక ప్రకారం..ఈ ఒక్క పథకంలోనేఏకంగా 15,704 మంది ఉద్యోగుల వివరాలు లబ్ధిదారుల జాబితాతో సరిపోలాయి. వీరిలో అత్యధికంగా 8,273 మంది గౌరవ వేతనం తీసుకుంటున్న చిరుద్యో గులు ఉండగా, 3,202 మంది అవుట్సోర్సింగ్ సిబ్బంది, 2,939 మంది

# బాధపడుతున్న ప్రతి ఇంటికి బాసటగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్

## నియోజకవర్గంలో ప్రతినిత్యం సేవా కార్యక్రమాలు... అనారోగ్యంతో బాధపడుతున్న లారీ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకున్న బీఆర్ఎస్ నేత వ్యాల్ల హరీష్ రెడ్డి



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన ముహమ్మద్ రహీముద్దీన్ గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యాడు. లారీ డ్రైవర్ గా పనిచేసే రహీముద్దీన్ రెక్కడితే గానీ పూట గడవని పరిస్థితి ఉంది. ఓవైపు కుటుంబ భారం, మరోవైపు అనారోగ్య సమస్యలు ఆర్థికంగా రహీముద్దీన్ కుటుంబాన్ని కుంగ దీశాయి. మనోధర్యం కోల్పోయిన రహీముద్దీన్ దీన గాధను తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పార్టీ శ్రేణులతో గురువారం పవర్ హౌస్ కాలనీలోని రహీముద్దీన్ ఇంటికి వెళ్లారు. కంటి నిండా దుఃఖంతో ఉన్న రహిముద్దీన్ కు బాసటగా ఉంటానని ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులకోసం పదివేల ఆర్థిక సహాయాన్ని అందించి మనోధైర్యాన్ని కల్పించారు. మాటలతో కాకుండా చేతలతో తన వంతు సహకారాన్ని అందిస్తూ హరీష్ రెడ్డి తనకంటూ ఓ ప్రత్యేకతను సాధిస్తున్నారు. ఇదే క్రమంలో వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, అనాథలకు తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు. తనకు ఉన్న దాంట్లో నలుగురికి పంచడమే భాగ్యం అంటూ ప్రజాసేవలో ప్రత్యేక మార్కు సాధిస్తున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో బాధతప్త కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పొలాడి శ్రీనివాస రావు, బూరుగు వంశీకృష్ణ, నడిపెల్లి సాయి, నూతి రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ఇండియాలో కొత్తగా 3 విమానయాన సంస్థలు



న్యూఢిల్లీ,: ఇండిగో సంస్థ చేసిన నిర్వాకం వల్ల దేశంలో ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. దేశంలోని అన్ని విమానాశ్రయాలలో ప్రయాణికులు గంటల తరబడి పడికాపులు కాయాల్సి వచ్చింది. దీంతో భారత్ పరువు పోయింది. ఫలితంగా భారత ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రతిపక్షాల అయితే కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాయి. ఒకానొక దశలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చిందిఇండిగో సంస్థ ఇచ్చిన షాక్ నుంచి కేంద్ర ప్రభుత్వం త్వరగానే మేల్కొంది. నేపథ్యంలో దేశంలో మరో రెండు విమాన సంస్థలకు పౌర విమానయాన శాఖ అనుమతులు ఇచ్చింది.

ఆల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్ ప్రెస్ సంస్థలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. పౌర విమానయాన శాఖ నుంచి ఈ సంస్థలకు నిరభ్యంతర పత్రాలు కూడా మంజూరయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో సంస్థ శంక్ ఎయిర్ అనే సంస్థకు కూడా ఇప్పటికే కేంద్రం నిరంతర పత్రం ఇచ్చింది. వచ్చేయడాల నుంచి ఆ సంస్థ కార్యకలాపాలు మొదలు పెట్టనుంది.ఇటీవల దేశీయ ఇండిగో సంస్థలో సంక్షోభం ఏర్పడింది. దీంతో దేశవ్యాప్తంగా కొద్ది రోజులపాటు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో అనేకమంది ప్రయాణికులు విమానాశ్రయాలలో చిక్కుకుపోయారు. ఈ వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్లో సుదీర్ఘంగా ప్రసంగించారు. విమానయాన రంగంలో ఏ సంస్థ పూర్తి స్థాయిలో ఆధిపత్యం కొనసాగించడానికి తాను ఆస్కారం ఇవ్వడం లేదని.. ఇంకా చాలా సంస్థలను ఈ రంగంలోకి ఆహ్వానిస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాదు కొత్త సంస్థలు కార్యకలాపాలు సాగించడానికి ఇదే అనుకూలమైన సందర్భం అని ఆయన పేర్కొన్నారు. ఇక మన దేశంలోని విమానయాన రంగంలో ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు 90% వాటా కలిగి ఉన్నాయి. ఇందులో ఇండిగో కే 65% వాటా ఉండడం విశేషం.

కేంద్రం తీసుకొచ్చిన నిబంధనల నేపథ్యంలో ఇండిగో సంస్థ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సర్వీసులను అప్పటికప్పుడు రద్దు చేసింది. కొన్ని సర్వీస్లను దారి మళ్ళించింది. దీంతో దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాలలో ప్రయాణికులు నరకం చూశారు. సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు విమానాశ్రయాలకే పరిమితం కావలసి వచ్చింది. ఈ పరిణామం నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర నిర్ణయం




# ఇప్పటికీ రూ.3వేల ఫోన్ వాడుతున్న ఎల్బీ శ్రీరామ్..



తెలుగు సినీ ప్రముఖుడు, హాస్యనటుడు ఎల్బీ శ్రీరామ్ తన డిజిటల్ అలవాట్లు, జీవితం పట్ల తన దృక్పథం గురించి వివరించారు. తాను రూ.30 వేల ఫోన్‌ను కొనుగోలు చేసే స్థోమత ఉన్నప్పటికీ, కేవలం రూ.3 వేల విలువైన సాధారణ ఫోన్‌ను మాత్రమే వాడతానని ఆయన వెల్లడించారు. అధిక మొబైల్ ఫోన్ వాడకం వల్ల తనలో భయం నెలకొందని, ఇది సృజనాత్మకతకు ఆటంకం కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఒక దశలో ల్యాండ్‌లైన్ ఫోన్‌ను వాడాలని కూడా ప్రయత్నించినట్లు శ్రీరామ్ తెలిపారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఫేస్‌బుక్‌లో తన స్నేహితులు పెట్టే కామెంట్లు, వాటికి స్పందించాలనే కోరిక, లైక్‌లు కొట్టడం వంటివి తీయతియ్యగా ఉన్నా, ఇవి తన సృజనాత్మకతను ఆపివేస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "నాకూ అందరిలాగే 24గంటలే ఉన్నాయి, 25 గంటలు లేవు. ఆ జబ్బులో పడిపోతే క్రియేషన్ చేయలేను" అని ఆయనస్పష్టం చేశారు. అందువల్ల, తాను పని కోసం టాబ్లెట్‌ను వాడతానని, షార్ట్ ఫిలిమ్స్, ఫేస్‌బుక్ వంటి అవసరాలను దాని ద్వారా తీర్చుకుంటానని చెప్పారు. జేబులో ఫోన్ పెట్టుకు తిరిగితే మాటిమాటికి వాడేస్తామని, ఎక్కడో ఒకచోట పెడితే పరిమితంగా వాడతామని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అధికంగా వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఈ వయసులో కొత్తగా అనారోగ్యాలు తెచ్చుకోవడం అవసరం లేదని శ్రీరామ్ సూచించారు. అనారోగ్యం వస్తే ఆసుపత్రి పాలైతే ఆస్తులు కరిగించుకోవడానికి తన వద్ద సంపద లేదని, తన జాగ్రత్తలో తానుంటానని అన్నారు. తెలియని రోగాలు ఎన్నో పొంచి ఉన్నాయని, ఎప్పుడు ఏది కాపుకాసి ఉందో తెలియదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. థర్డ్ స్టేజ్‌లో వచ్చే వ్యాధుల గురించి, ఆరు నెలలకొకసారి చెకప్‌లు చేయించుకోవాలనే సూచనల గురించి మాట్లాడుతూ, చాలాసార్లు మిషన్లు నార్మల్ అనే రిపోర్ట్‌లు ఇస్తాయని, కానీ సడన్‌గా ఏదో కొంపముంచుతుందని అన్నారు. మృత్యువు లక్ష మార్గాల్లో వెంటాడుతుందని, 99,999 జాగ్రత్తలు తీసుకున్నా ఆ లక్షవది ఎక్కడో తెలియకుండా ఉంటుందని శ్రీరామ్ తాత్వికంగా మాట్లాడారు. ఈ చర్చ ఇలా తెల్లవార్లు మాట్లాడుకున్నా ఎక్కడికో వెళుతుందని ఆయన పేర్కొన్నారు.


# సినిమా

## సబ్‌స్క్రిప్షన్ వార్తలపై అనన్య నాగళ్ల క్లారిటీ ఇదే!




ఇటీవల యాంకర్, నటి విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో సబ్‌స్క్రిప్షన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా, ఆమెపై కొందరు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారి కోసం ఆమె స్పెషల్‌గా వీడియోలు, ఫొటోలు పెడుతూ, డబ్బు సంపాదిస్తుందని, తద్వారా కుర్రాళ్లను తప్పుదోవ పట్టిస్తోందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో ఆమె పోలీసుల విచారణను సైతం ఎదుర్కొంటున్నారు. ఇప్పుడామె బాటలోనే తెలుగుహీరోయిన్ అనన్య నాగళ్ల కూడా సబ్‌స్క్రిప్షన్ అంటూ తెగ హడావుడి చేస్తోన్నట్లుగా వార్తలు వైరల్ అవుతున్నాయి. కానీ, ఆమె పేజీకి వెళ్లి చూస్తే, ఆ ఆప్షన్‌కనిపించడం లేదు. దీంతో వ్యవహారమంతా గందరగోళంగా మారింది. ఈ విషయంలో తనని అందరూ తప్పుగా అర్థం చేసుకుంటున్నారని భావించిన అనన్య నాగళ్ల తాజాగా తన ఇన్‌స్టా వేదికగా ఈవిషయమై క్లారిటీ ఇచ్చారు."నేనుఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారానా అభిమానులకు, ప్రజలకుదగ్గర కావడం కోసం మాత్రమే నేను ఈ ఆప్షన్ ఎంచుకున్నాను తప్పితే, ఇతరత్రా వాటి కోసం కాదు. ఈ ఆప్షన్ ద్వారా నా జీవితంలో నాకు జరిగినవి, జరుగుతున్నవి ప్రజలకు తెలియజేసి నాకు తోచిన విధంగా అందరికీ సహాయపడాలనే సదుద్దేశంతోనే నేను సబ్‌స్క్రిప్షన్ ఎంచుకున్నాను. ఈ సబ్‌స్క్రిప్షన్ పెట్టినప్పుడే నేను ఏమనుకున్నానంటే.. రెగ్యులర్‌గా అందరితో కాంటాక్ట్‌లో ఉండాలి, కనెక్ట్ అవ్వాలి.. అలాగే ఒకరికొకరం కమ్యూనిటీగా ఉంటూ గ్రో అవ్వాలనేది నా ఉద్దేశ్యం. నాకు లైఫ్‌లో యూస్‌ఫుల్ అయిన ఎక్స్‌పీరియన్సెస్, ప్రాక్టీసెస్, నా డైలీ రొటీన్ మీతో షేర్ చేయాలి. అండ్ మీ దగ్గర నుంచి కొన్ని విషయాలు నేర్చుకోవాలని నేను అనుకున్నాను. అంతేకాదు, ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా వచ్చిన అమౌంట్‌తో మంత్లీ సొసైటీకి ఏదైనా చిన్న హెల్ప్ చేద్దామనేది నా మోటో" అని చెప్పుకొచ్చారు. ఇంకా ఈ వీడియోలో ఆమె ఓ టిప్ కూడా చెప్పారు. 'ఓం నమః శివాయ' అనే మంత్రాన్ని 21డేస్ 108 టైమ్స్ డైలీ జపిస్తే, మనకే తెలియకుండా మనకి చాలా పీస్‌ఫుల్‌గా ఉంటుందని, యాంగ్జైటీ తగ్గుతుందని, మెంటల్లీ కామ్ అయిపోతుందని ఆమె ఇందులో తెలిపారు. ఇలాంటి విషయాలతో పాటు, నా షూటింగ్స్‌కు సంబంధించి కొన్ని ఎక్స్‌క్లూజివ్ విశేషాలు తెలిపేందుకే సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ తీసుకున్నట్లుగా అనన్య నాగళ్ల క్లారిటీ ఇచ్చారు.

# చేతి నిండా ప్రాజెక్టులతో రాశీ ఖన్నా ఫుల్ బిజీ!



తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళుతున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. "ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్" అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా నటించిన 'లుక్కే' అనే వెబ్ సిరీస్ మే 8న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. 8 ఎపిసోడ్ల ఈ మ్యూజికల్ యాక్షన్ డ్రామా సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. వీటితో పాటు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి 'ఫర్జీ' సీజన్ 2లో, విక్రాంత్ మాస్సేతో 'తలాఖో మే ఏక్', ఆర్. మాధవన్‌తో 'బ్రిడ్జ్' వంటి ప్రతిష్ఠాత్మక

## కృష్ణావతారం చిత్రంలో సత్యభామగా సంస్కృతి జయాన




ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ మనవరాలు సంస్కృతి జయనా సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. రాజకీయ, వ్యాపార నేపథ్యం ఉన్న ఆమె సినిమాల్లోకి రావడం విశేషం. కమర్షియల్ బాలీవుడ్ సినిమాతో కాకుండా భక్తి నేపథ్యం ఉన్న పౌరాణిక చిత్రం 'కృష్ణావతారం పార్ట్-1: ది హార్ట్' చిత్రంతో ఆమె వెండితెరకు పరిచయమవుతున్నారు. ఇందులో ఆమె శ్రీకృష్ణుని భార్య సత్యభామ పాత్రలో కనిపిస్తున్నారు. కేవలం ఒక పాత్రలా కాకుండా.. ఈ కథ మొత్తం సత్యభామ కోణంలోనే సాగుతుండటం గమనార్హం. ఇందులో సిద్ధార్థ్ గుప్తా శ్రీకృష్ణుడిగా నటిస్తుండగా.. రాధగా సుస్మితా భట్, రుక్మిణిగా నివాసిని కృష్ణన్ నటిస్తున్నారు. హార్దిక్ గజ్జర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 7న థియేటర్లలో విడుదల కానుంది. నటిగా కృష్ణావతారం ఆమెకు తొలి చిత్రం. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేయగా 3.5 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. సంస్కృతి జయనా నటి మాత్రమే కాదు. సక్సెస్‌ఫుల్ వ్యాపారావేత్త కూడా. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో నటన-నృత్యంలో శిక్షణ పొందారు. 16 ఏళ్ల వయసులోనే తన సొంత ఫ్యాషన్ బ్రాండ్‌ను ప్రారంభించి జిమ్మీ చూ, బొట్టెగా వెనెటా వంటి గ్లోబల్ బ్రాండ్‌లతో కలిసి పని చేసిన అనుభవం ఆమెకు ఉంది.

## విజయ్ దేవరకొండ-శౌర్యువ్ చిత్రం ప్రారంభం..

# ముహూర్తం షాట్ కు నాని క్లాప్



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రారంభించారు. 'హాయ్ నాన్న' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న శౌర్యువ్‌తో ఆయన ఈ చిత్రాన్ని చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి న్యాచురల్ స్టార్ నాని ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్ కొట్టి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్, నాని కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇద్దరు ప్రముఖ హీరోలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'హాయ్ నాన్న'కు అద్భుతమైన సంగీతం అందించిన హేషమ్ అబ్దుల్ వహాబ్, ఈ చిత్రానికి కూడా స్వరాలు సమకూర్చనున్నారు. ప్రస్తుతం సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయ్ దేవరకొండ తన ప్రస్తుత కమిట్‌మెంట్లు పూర్తి చేసిన వెంటనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొంటారని తెలుస్తోంది. నటీనటులు, ఇతర సాంకేతిక సిబ్బంది వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఇంతకుముందే, దీనిపై విజయ్ దేవరకొండ తన సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్ట్ చేశారు.



## చంటిగాడు లోకల్.. పూరీ జగన్నాథ్ జర్నీపై విజయ్ సేతుపతి పవర్‌ఫుల్ మెసేజ్



పవర్ ఫుల్ మాస్ డైలాగ్స్‌తో మెసేజ్‌తోపాటు ఎంటర్‌టైన్‌మెంట్ అందించే డైరెక్టర్లలో టాప్‌లో ఉంటాడు పూరీ జగన్నాథ్. పవన్‌కల్యాణ్, రవితేజ, మహేశ్ బాబు, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ఇలా ఎంతోమందికి బ్రేక్ ఇవ్వడమే కాదు ఇండస్ట్రీ రికార్డులను బద్దలు కొట్టాడు ఈ డాషింగ్‌డైరెక్టర్. 1) సిటీకి ఎంతోమంది కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు.. చంటిగాడు లోకల్.. 2) ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా బుల్లెట్ దిగిందా లేదా..? 3) పది మందిని మోసం చేస్తే ఎంతో కొంత బాగుపడతావ్.. నిన్ను నువ్వు మోసం చేసుకుంటే సంకనాకి పోతావ్.. 4) రేప్ చేశామని ఒప్పుకునే దమ్ము మాకుంది.. మమ్మల్ని శిక్షించే ధైర్యం మీకుందా..? అంటూ క్లాస్, మాస్ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే ఇలాంటి డైలాగ్స్ ఎన్నో రాసి ప్రేక్షకులను ఆలోచింపజేయడం ఒక్క పూరీకే సాధ్య మవుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇండస్ట్రీకి బ్లాక్ బస్టర్స్ హిట్లు వన్ ఆఫ్ ది లీడింగ్ డైరెక్టర్లలో ఒకరిగా నిలిచి నపూరీ సినీ పరిశ్రమలోకి ఎంట్రీఇచ్చి 26సంవత్సరాలు పూర్తి చేసుకున్నాడు. ఈ సందర్భంగా పూరీతో కలిసి పనిచేస్తున్న యాక్టర్ విజయ్‌సేతుపతి ఓ మెసేజ్‌ను అందరితో పంచుకున్నాడు. సినిమాతో 26 ఏండ్లుగా ప్రయాణం సాగించడం కేవలం మైల్‌స్టోన్ మాత్రమే కాదు.. ఇది ధైర్యం, ధృఢ విశ్వాసం, నిర్భయమైన స్వరంతో నిర్మించబడ్డ వారసత్వం. ప్రియమైన పూరీ సార్ మీతో 'స్లమ్ డాగ్-33 టెంపుల్ రోడ్'కు పనిచేయడం ఆనందంగా ఉంది. జోన్లను దాటి చూపించే దర్శకుల కోసం ఎదురుచూస్తుంటాం. మీరు ఆ పనిని అవిశ్రాంతంగా పూర్తి చేశారు. ఈ సినిమా కోసం పనిచేస్తున్న మాకందరికీ స్లమ్ డాగ్-33 టెంపుల్ రోడ్ చాలా ప్రత్యేకమైనదిగా గుర్తు పెట్టుకునేలా ఉంటుంది

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411